జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం | 5 | ఏప్రిల్ | 2026 | పేజీలు : 6

## బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకం చేపట్టాలి

### రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 4, ప్రజా జ్యోతి:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకాన్ని వేగవంతం చేయడానికి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో సహకరించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. శనివారం హైదరాబాదు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు.




2 లో

## ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతానికి చర్యలు తీసుకోవాలి

### - జిల్లా కలెక్టర్ అంకిత్




**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 4 ,ప్రజా జ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేసి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శనివారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లాలోని అన్ని ఏరియా ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, వైద్యశాఖ అధికారులతో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆసుపత్రుల పనితీరు, అభివృద్ధి పనులు, ఆరోగ్యశ్రీ సేవలు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అమలవుతున్న ఆరోగ్యశ్రీ సేవలపై పూర్తి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రుల పరిధిలో కొనసాగుతున్న నూతన నిర్మాణాలు, మరమ్మత్తుల పనుల పురోగతిని సమీక్షించి, పనులను నిర్దిష్ట గడువులో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి ఆసుపత్రి వారీగా సూపరింటెండెంట్ల నుండి సమాచారం సేకరించి, ఆసుపత్రుల్లో నెలకొన్న సమస్యలు, సిబ్బంది కొరత, వైద్యుల లభ్యత వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన సిబ్బంది, వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, వైద్యులు సమయపాలన పాటిస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మరుగుదొడ్ల మరమ్మత్తుల అవసరాన్ని సూపరింటెండెంట్ తెలియజేయగా, వెంటనే అవసరమైన చర్యలు..

వివరాలు 2లో..

# పెద్ద బజార్లో ట్రాఫిక్ రద్దీ

- ట్రాఫిక్ నియంత్రణకు మార్గమే లేదా..?
- భారీ వాహనాల రాకతో ప్రజలకు ముప్పు
- నిత్యం ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- అధికారుల స్పందనతోనే సమస్యకు పరిష్కారం




**కొత్తగూడెం, ఏప్రిల్ 4 (ప్రజాజ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని పెద్ద బజార్ మార్కెట్ ప్రాంతం రోజురోజుకు ట్రాఫిక్ రద్దీతో కిక్కిరిసిపోతోంది. వ్యాపారులకు సరుకులు తరలించే భారీ లారీలు నిరంతరం సంచరిస్తుండటంతో రహదారులపై తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఇప్పటికే ఇరుకైన రహదారులపై భారీ వాహనాలు సులభంగా తిరగలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఈ క్రమంలో వాహనాలు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాలకు తగిలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశముందని ట్రాఫిక్ నియంత్రణకు సరైన చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పెద్ద బజార్ ప్రాంతంలోకి భారీ లారీలు ప్రవేశించడం వల్ల ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమవుతోంది. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్‌కు వచ్చే సరుకులను పట్టణ ప్రారంభంలోనే అన్‌లోడింగ్ పాయింట్ ఏర్పాటు చేసి అక్కడి నుంచి చిన్న వాహనాల ద్వారా తరలిస్తే ట్రాఫిక్ సమస్య కొంతవరకు తగ్గే అవకాశం ఉందని స్థానికులు సూచిస్తున్నారు.

**ట్రాఫిక్ నియంత్రణలో లోపాలపై విమర్శలు**

పట్టణంలోని ఎం.జి రోడ్ పరిసరాల్లో ట్రాఫిక్ నియంత్రణ పరికరాలు ఏర్పాటు చేసినప్పటికీ పెద్ద బజార్‌లో మాత్రం తగిన చర్యలు కనిపించకపోవడం విమర్శలకు తావిస్తోంది. సంబంధిత అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు వ్యాపారుల నుంచి లాభాలు పొందుతున్నందునే అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**భారీ వాహనాల రాకతో ప్రమాద సూచనలు**

నిత్యం రద్దీగా ఉండే పెద్ద బజార్ గల్లీల్లో భారీ లారీలు సంచరించడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజా సంఘాల నాయకులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే కూరగాయల బండ్లు, చిన్న వ్యాపారాలు రోడ్డుపై ఉండటంతో మార్గం మరింత ఇరుకుగా మారింది. ఈ పరిస్థితుల్లో అత్యవసర సమయంలో అంబులెన్స్ వంటి వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

**తక్షణ చర్యలపై ప్రజల డిమాండ్**

పెద్ద బజార్‌లో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలంటే..

వివరాలు 2లో..

# ఎలాగైనా కాజెయ్యాలని..!

- కార్పొరేషన్‌లో కోటి విలువైన ప్రభుత్వ భూమి కబ్జా
- అధికారుల అడ్డుకట్ట తర్వాత... మళ్లీ జోరుగా నిర్మాణ పనులు
- 13వ డివిజన్‌లో సర్కార్ జాగాకు రక్షణ కరువు



**కొత్తగూడెం, ఏప్రిల్ 4 (ప్రజాజ్యోతి) :** ఇన్నాళ్లు మున్సిపాలిటీగా ఉన్న కొత్తగూడెం తాజాగా కార్పొరేషన్‌గా మారడంతో అక్రమార్కుల చూపు ఖాళీ భూములపై పడింది. ప్రభుత్వ భూమి ఎక్కడ కనిపించినా అక్కడే కబ్జా చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరమవుతున్నాయి. కోట్ల రూపాయల విలువ చేసే భూములను దర్జాగా ఆక్రమిస్తూ తమ వశం చేసుకోవాలని కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో ఈ కబ్జాలు పెరుగుతుండగా ముఖ్యంగా 13వ డివిజన్‌లో పరిస్థితి మరింత తీవ్రంగా మారింది. గతంలో సుమారు కోటి రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నారని సమాచారం అందడంతో రెవెన్యూ అధికారులు నిర్మాణ పనులను అడ్డుకున్నారు. అయితే కొంతకాలం నిలిచిపోయిన ఆ పనులు మళ్లీ జోరుగా కొనసాగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వివరాలు 2లో..

# జిల్లా వ్యాప్తంగా నాకాబందీ

2 లో

### అసాంఘిక కార్యకలాపాలపై కట్టడి లక్ష్యం

### వాహనాల తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహణ



# ఎలాగైనా కాజెయ్యాలని..!

ఆ స్థలం ప్రభుత్వ భూమేనని స్పష్టంగా తెలుస్తోంది. ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం అది సుమారు కోటి రూపాయలు ఉంటుందని సమాచారం. అయితే కార్పొరేషన్ నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతులు లేకుండానే 13వ డివిజన్‌లో ఓ వ్యక్తి నిర్మాణ పనులు చేపడుతున్నాడని ఆరోపణలు ఉన్నాయి. అధికారులకు సమాచారం ఇవ్వకుండా వేగంగా పనులు పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని స్థానికులు చెబుతున్నారు. గతంలో అధికారులు స్పందించి పనులను నిలిపివేసినా ఇప్పుడు మళ్లీ అదే నిర్మాణం కొనసాగుతుండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల హెచ్చరికలను పట్టించుకోకుండా పనులు ఎలా కొనసాగుతున్నాయో తెలియదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**13వ డివిజన్‌లో సర్కార్ జాగాకు రక్షణ కరువు**

కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని 13వ డివిజన్‌లో ప్రభుత్వ భూమిపై అక్రమంగా కబ్జా చేసి రెండంతస్తుల భవనం నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు సమాచారం. నగరంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఖాళీ స్థలాలపై అక్రమార్కుల దృష్టి పెరుగుతోంది. ప్రభుత్వ, ప్రైవేట్ భూములపై కబ్జాలు జరుగుతున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భూముల ధరలు పెరుగుతుండడంతో అక్రమార్కుల ఆశలు మరింత పెరిగి కోట్ల విలువైన భూములను కాజేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. డివిజన్లలో ఎక్కడ ఖాళీ స్థలం కనిపించినా కబ్జాలు జరుగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. సంబంధిత రెవెన్యూ, కార్పొరేషన్ అధికారుల పర్యవేక్షణ లోపమే ఈ అక్రమాలకు కారణమని ప్రజలు ఆరోపిస్తున్నారు. గతంలో కొత్తగూడెం తహసీల్దార్ పుల్లయ్య ఆదేశాల మేరకు రెవిన్యూ శాఖ అధికారులు నిర్మాణ పనులను అడ్డుకున్నప్పటికీ మళ్లీ పనులు ప్రారంభం కావడం



పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# పెద్ద బజార్లో ట్రాఫిక్ రద్దీ



సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు స్పందించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొంటున్నారు. ప్రమాదాలు జరగకముందే ట్రాఫిక్ నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతానికి చర్యలు తీసుకోవాలి

తీసుకుని పనులను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందిస్తున్న అత్యాధునిక వైద్య సేవలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, పేద ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లకుండా ప్రభుత్వ ఆసుపత్రులపైనే విశ్వాసం పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సాధారణ ప్రసవాలు, సిజేరియన్ ప్రసవాల వివరాలను సమీక్షించి, అవసరమైన చోట సేవలను మరింత మెరుగుపరచాలని తెలిపారు. ప్రతి ఆసుపత్రిలో పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు తగిన శానిటేషన్ సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని . జిల్లాలోని బ్లడ్ బ్యాంకుల పనితీరు, రక్త నిల్వల వివరాలను పరిశీలించి అత్యవసర సేవలకు ఎటువంటి లోటు లేకుండా చూడాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతానికి కృషి చేయాలని, ప్రైవేటు స్కానింగ్ సెంటర్లపై పర్యవేక్షణ, తనిఖీలు నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. జిల్లాలో నమోదు అవుతున్న సికిల్ సెల్ అనీమియా కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని, కేసుల అధికత ఉన్న మండలాలు, పరీక్షల నిర్వహణ విధానం, కిట్ల లభ్యతపై పూర్తి నివేదిక సమర్పించాలని



ఆదేశించారు. ఈ సమావేశంలో డిసిహెచ్‌ఓ రవిబాబు , ఏరియా ఆసుపత్రుల సూపరింటెండెంట్లు , సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకం చేపట్టాలి

ఈ ఆయన సందర్భంగా మాట్లాడుతూ మండలాల వారీగా ఇప్పటికే అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారులకు (ఏఈఆర్‌ఓలు), బూత్ లెవెల్ అధికారులకు బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకంపై సమావేశాలు నిర్వహించినందున, ఎస్ఐఆర్ ప్రక్రియను మరింత వేగవంతం చేయడానికి రాజకీయ పార్టీల ప్రతినిధుల సహకారం తీసుకోవాలని సూచించారు. ఇప్పటివరకు సమావేశాలు జరగని ప్రాంతాల్లో వెంటనే సమావేశాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బూత్ లెవెల్ అధికారులు సంబంధిత యాప్‌పై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని, ఓటరు వివరాల మ్యాపింగ్ ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు . ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఈ సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతి ఇప్పటికే 61.25 శాతానికి చేరుకుందని తెలిపారు. మిగిలిన పనులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయడానికి అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని, ప్రతి మండలంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటూ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని చెప్పారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయం పెంచి బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకాన్ని త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు ,ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా, ఖచ్చితత్వంతో సాగేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వివరించారు, ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఎన్నికల సూపరింటెండెంట్ రంగ ప్రసాద్, సిబ్బంది నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# టేకులపల్లిలో పోలీసుల ముమ్మర తనిఖీలు

**'నాకాబంది'తో నేరస్తులకు చెక్**

**టేకులపల్లి,ఏప్రిల్ 04, ప్రజాజ్యోతి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా శనివారం రాత్రి టేకులపల్లి కేంద్రంలో పోలీసులు భారీ నాకాబంది నిర్వహించారు. టేకులపల్లి సీఐ బత్తుల సత్యనారాయణ నేతృత్వంలో జరిగిన ఈ తనిఖీల్లో పోలీసులు వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి,అనుమానితులను విచారించారు.ముమ్మరంగా సాగిన వాహన తనిఖీలు రాత్రి 10 గంటల వరకు కొనసాగిన ఈ ఆపరేషన్‌లో టేకులపల్లి సెంటర్ మీదుగా వెళ్లే ద్విచక్ర వాహనాలు, కార్లు మరియు ఇతర భారీ వాహనాలను పోలీసులు నిలిపివేసి సోదాలు చేశారు. వాహన పత్రాలను పరిశీలించడంతో పాటు, డిక్కీలను ప్రయాణికుల బ్యాగులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తులను ప్రశ్నించి, వారి వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టేకులపల్లి పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**నాకాబంది అంటే ఏమిటి? ఎందుకు నిర్వహిస్తారు?**

పోలీసు పరిభాషలో 'నాకాబంది' అంటే నిర్దేశిత ప్రాంతాల్లో రహదారులను దిగ్బంధించి తనిఖీలు చేపట్టడం. దీని ప్రధాన ఉద్దేశాలు ఇవే:నేరాల నియంత్రణ,దొంగతనాలు, చైన్ స్నాచింగ్ వంటి నేరాలకు పాల్పడి తప్పించుకునే నేరస్థులను పట్టుకోవడం. అక్రమ రవాణా అడ్డుకట్ట గంజాయి, మద్యం, నగదు లేదా ఇతర నిషేధిత వస్తువుల అక్రమ రవాణాను నిరోధించడం.భద్రతా భావం: ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించడం అసాంఘిక శక్తుల్లో భయాన్ని కలిగించడం.

**డ్రంక్ అండ్ డ్రైవ్:**

మద్యం సేవించి వాహనాలు నడిపేవారి వల్ల జరిగే ప్రమాదాలను అరికట్టడం.నాకాబంది వల్ల ఉపయోగాలు నేరగాళ్ల గుర్తింపు నంబర్ ప్లేట్ లేని వాహనాలు, చోరీకి గురైన వాహనాలను గుర్తించే అవకాశం ఉంటుంది. శాంతి భద్రతలు రాత్రి వేళల్లో అనవసరంగా తిరిగే వారిని నియంత్రించడం ద్వారా అల్లర్లు, గొడవలను నివారించవచ్చు.రోడ్డు ప్రమాదాల తగ్గింపు: అతివేగం మరియు మద్యం మత్తులో వాహనాలు నడిపేవారిని పట్టుకోవడం వల్ల సామాన్య ప్రజల ప్రాణాలు కాపాడబడతాయి.

**ప్రజలకు సూచనలు – తీసుకోవలసిన జాగ్రత్తలు**



పోలీసు తనిఖీల సమయంలో ప్రజలు ఈ క్రింది జాగ్రత్తలు పాటించాలని అధికారులు కోరుతున్నారుసహకరించండి పోలీసులు వాహనాన్ని ఆపినప్పుడు సహకరించాలి. ఇది మీ భద్రత కోసమే అని గుర్తించాలి. పత్రాలు సిద్ధంగా ఉంచుకోండి: డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ ఇన్సూరెన్స్ పొల్యూషన్ సర్టిఫికేట్ ఎల్లప్పుడూ దగ్గర ఉంచుకోవాలి. హెల్మెట్ డ సీట్ బెల్ట్: వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ లేదా సీట్ బెల్ట్ ధరించాలి.

**అనుమానితుల సమాచారం:**

మీ ప్రాంతంలో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలి.ప్రజల రక్షణే మా ప్రాధాన్యత. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం అని ఈ సందర్భంగా సీఐ సత్యనారాయణ హెచ్చరించారు.

# ఫీజు బకాయిలపై హైకోర్టు తీర్పు సరైంది కాదు

**- పేద విద్యార్థుల చదువులకు తీవ్ర భంగం**

**- ప్రభుత్వ హామీలతోనే అడ్మిషన్లు -- ఇప్పుడు వసూళ్లు అన్యాయం**




**చుంచుపల్లి, ఏప్రిల్ 4 ( ప్రజాజ్యోతి ) :** ఫీజు బకాయిల విషయంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు సరైంది కాదని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ విమర్శించారు. విద్యార్థుల నుంచి ముందుగా ఫీజులు వసూలు చేసి తరువాత ప్రభుత్వం చెల్లించాలని చెప్పడం వల్ల పేద విద్యార్థుల చదువులకు తీవ్ర నష్టం కలుగుతుందని ఆయన అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేస్తామని అంగీకరించిన ప్రైవేటు కళాశాలలు అదే హామీతో విద్యార్థులను చేర్చుకున్నాయని తెలిపారు. అలాంటి పరిస్థితిలో యాజమాన్యాల బకాయిలపై చర్యలు తీసుకోకుండా విద్యార్థులపై భారం మోపడం అన్యాయమని పేర్కొన్నారు. రాష్ట్రంలో సుమారు 14 లక్షల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని తాజా తీర్పు వల్ల వారు మరింత ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే ఫీజు బకాయిల పేరుతో ప్రైవేటు కళాశాలలు విద్యార్థుల సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధింపులకు గురిచేస్తున్నాయని ఈ కారణంగా గతంలో తీవ్ర పరిణామాలు కూడా చోటుచేసుకున్నాయని గుర్తు చేశారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేసి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే హైకోర్టు తీర్పును పునఃసమీక్ష చేసి ఫీజుల విడుదలకు ప్రభుత్వానికి తక్షణ ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మాణిక్యాల వినయ్, జిల్లా ఉపాధ్యక్షులు సంజయ్, కీర్తన, మై సంజన, మానస, స్వప్న, స్పందన, కవిత, సోని, ఉదయ్, రాజేష్, మహేష్ పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా నాకాబందీ

**అసాంఘిక కార్యకలాపాలపై కట్టడి లక్ష్యం**

**వాహనాల తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహణ**

**కొత్తగూడెం, ఏప్రిల్ 4 ( ప్రజాజ్యోతి ) :**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడానికి పోలీసులు నాకాబందీ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఏకకాలంలో ఈ కార్యక్రమం చేపట్టారు. శనివారం రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకు కొనసాగిన ఈ ప్రత్యేక తనిఖీల్లో వాహనాల తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించినట్లు ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. నేరాల నియంత్రణలో భాగంగా పాత నేరస్తులను గుర్తించేందుకు ఫింగర్‌ప్రింట్ డివైస్‌లతో తనిఖీలు చేపట్టినట్లు పేర్కొన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణాను అరికట్టడం రోడ్డు ప్రమాదాలను నివారించడం లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు చెప్పారు. జిల్లాలో శాంతిభద్రతలు కాపాడేందుకు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారని స్పష్టం చేశారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల గురించి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఈ సందర్భంగా ఎస్పీ కోరారు.

# వృద్ధాశ్రమానికి 'సౌర' వెలుగులు

**తాళ్లూరి పంచాక్షరయ్య ట్రస్ట్ భారీ వితరణ**
**రూ. 5 లక్షల వ్యయంతో 10 కేవీ సోలార్ ప్లాంట్ ఏర్పాటు**
**తొలి జీతాన్ని సామాజిక సేవకు వెచ్చించిన ప్రవాస భారతీయుడు సాయిపంచాక్షర్**



**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 4 ప్రజాజ్యోతి**
నిరుపేదలు, వృద్ధుల పట్ల తాళ్లూరి పంచాక్షరయ్య చారిటబుల్ ట్రస్టు మరోసారి తన ఉదారతను చాటుకుంది. భద్రాచలంలోని సరోజిని వృద్ధాశ్రమానికి రూ. 5 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన 10 కేవీ సోలార్ విద్యుత్ వ్యవస్థను శనివారం లాంఛనంగా ప్రారంభించారు.

**తొలి జీతంతో సేవా కార్యక్రమం**
ట్రస్ట్ చైర్మన్ తాళ్లూరి పంచాక్షరయ్య మనవడు, తానా మాజీ అధ్యక్షుడు తాళ్లూరి జయశేఖర్ – నీలిమ దంపతుల కుమారుడు సాయిపంచాక్షర్ తన సేవా గుణాన్ని చాటుకున్నారు. అమెరికాలో ఉద్యోగం చేస్తున్న ఆయన, తన మొదటి నెల వేతనం రూ. 5 లక్షలను వెచ్చించి ఈ సోలార్ విద్యుత్ సౌకర్యాన్ని కల్పించడం విశేషం. చిన్నతనం నుంచే సామాజిక స్పృహ కలిగిన సాయిపంచాక్షర్, తన సొంత గడ్డపై సేవా కార్యక్రమాలకు చేయూతనివ్వడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

**ఆశ్రమ అభివృద్ధిలో కీలక పాత్ర:**
బూర్గంపాడు మండలం ఇరవెండికి చెందిన తాళ్లూరి కుటుంబం గతంలోనే ఈ ఆశ్రమ భవన నిర్మాణంతో పాటు పలు అభివృద్ధి పనులను చేపట్టింది. ప్రస్తుతం సోలార్ విద్యుత్ ఏర్పాటు ద్వారా ఆశ్రమానికి కరెంటు కష్టాలు తీరడమే కాకుండా, విద్యుత్ బిల్లుల భారం కూడా తగ్గనుంది. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు సరోజిని మాట్లాడుతూ.. ట్రస్ట్ సభ్యులు చూపుతున్న నిరంతర ఆదరణకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పట్టణ ప్రముఖులు అడుసుమిల్లి జగదీశ్, పల్లంటి దేశప్ప, మోతుకూరి వీరయ్య, బొడ్డపాటి రామారావు, చావా లక్ష్మీనారాయణ, జలగం చంద్రశేఖర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని ట్రస్ట్ సేవలను కొనియాడారు ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ తాళ్లూరి పంచాక్షరయ్య, తానా మాజీ అధ్యక్షులు తాళ్లూరి జయశేఖర్ – నీలిమ దంపతులతో పాటు ట్రస్ట్ డైరెక్టర్ వల్లూరిపల్లి వంశీకృష్ణ, బూర్గంపాడు పీఏసీఎస్ మాజీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, భద్రాచలం సర్పంచ్ పూనెం కృష్ణ పాల్గొన్నారు.

# కొత్తగూడెం ప్రగతి మైదానంలో క్రికెట్ సందడి

**- ఎంపీ వద్దిరాజు చేతుల మీదుగా గాయత్రి క్రికెట్ ఛాంపియన్స్ ట్రోఫీ--2026 ప్రారంభం**

**కొత్తగూడెం, ఏప్రిల్ 4 ( ప్రజాజ్యోతి )**
ఆటలలో పాల్గొనడం ద్వారా శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం పెరుగుతుందని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని ప్రగతి మైదానంలో శనివారం గాయత్రి క్రికెట్ ఛాంపియన్స్ ట్రోఫీ--2026ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక యువకులు బాణసంచా పేల్చి డప్పు వాయిద్యాలతో ఎంపీకి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎంపీ రవిచంద్రతో పాటు బీఆర్ఎస్ నాయకులు అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టాస్ వేసి స్వయంగా బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించిన ఎంపీ, క్రికెట్ జట్టు సభ్యులతో పరిచయం అయ్యారు. నిర్వాహకులు బీ.శ్రీనివాస్, కన్నీలు పాల్గొన్న క్రీడాకారులను పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో భారత క్రికెట్ జట్టు అద్భుత ప్రతిభ కనబర్చుతోందని ప్రశంసించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని క్రీడా రంగంలో మంచి అవకాశాలు ఉన్నాయని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దిండిగల రాజేందర్, వనమా రాఘవ, కాపు సీతామహాలక్ష్మి, ఆకుల గాంధీ, ఏనుగుల రాకేష్ రెడ్డి, రంగనాథ్, బాదావత్ శాంతి నాయక్ తదితరులతో పాటు




కార్పొరేటర్లు మల్హోత్రా సాగర్, కాలేరు సింధూ తపస్వి, బొమ్మిడి రమాకాంత్, బాదావత్ శ్రీకాంత్, నవతన్, అనుదీప్ తదితరులతో పాటు యువత ఈ పోటీలకు హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు.

# కార్మికుల హక్కుల పరిరక్షణ ఐఎన్టియుసి తోనే సాధ్యం

**టేకులపల్లి, ఏప్రిల్ 4, ప్రజాజ్యోతి:** సింగరేణి కార్మికుల హక్కుల పరిరక్షణ ఐఎన్టియుసి తోనే సాధ్యమని ఐఎన్టియుసి సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ త్యాగరాజు, ఐఎన్టియుసి ఇల్లందు ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు లు స్పష్టం చేశారు.శనివారం ఇల్లందు ఏరియా కెఓసిలో జరిగిన ఐఎన్టియుసి పిట్ సమావేశంలో వారు మాట్లాడుతూ సీఎంతో జరిగే సమావేశాల్లో సింగరేణి కార్మికుల సమస్యలపై కోల్ బెల్ట్ ఎమ్మెల్యేలు, మంత్రులు మాట్లాడే విధంగా చూస్తామన్నారు.సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం వర్క్‌పై ఆదాయ పన్ను మాఫీ,కార్మికులకు సొంత ఇంటి పథకం అమలు,మెడికల్ బోర్డు పునరుద్ధరణ వంటి కీలక అంశాలపై ఐఎన్టియుసి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుంద ని తెలిపారు. ఐఎన్టియుసి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జి. సంజీవ రెడ్డి,సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ నాయకత్వంలో కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి జరుగుతుందని స్పష్టం చేశారు.గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి 2 ఏళ్ళు పూర్తయినా కార్మికుల సమస్యలపై దృష్టి పెట్టకుండా ఏఐటియుసి కాంగ్రెస్ పార్టీ గెలిపించిన ఒక ఎమ్మెల్యే ను పట్టుకొని రాజకీయ ప్రయోజనాలకే పరిమితమైందని విమర్శించారు. గుర్తింపు సంఘంగా పూర్తిగా విఫలమైన ఏఐటియుసి ప్రస్తుతం ధర్నాలు,దొంగ దీక్షల పేరుతో కార్మికులను మోసం చేయడానికి ప్రయత్నిస్తుందని విమర్శించారు.కాంగ్రెస్ సహకారం తో సహాయంతో గెలిచిన ఒక్క ఎమ్మెల్యేతో సింగరేణిలో



రాజకీయ జోక్యం చేస్తూ కార్మిక సమస్యలను పరిష్కరించడానికి చేతకాక చేతులు దులుపుకొని, కాంగ్రెస్ పార్టీ రాజకీయ జోక్యం చేస్తుందని అనటం ఏమిటని ప్రశ్నించారు.మున్సిపల్ ఎన్నికల్లో అక్రమ పొత్తులు పెట్టుకోవడం, స్ట్రక్చర్ మీటింగ్‌ను బహిష్కరిం చడం వంటి చర్యలు కార్మిక సంఘం బాధ్యతలకు విరుద్ధమని పేర్కొన్నారు.ప్రాతినిధ్య సంఘంగా ఐఎన్టియుసి చొరవతోనే మళ్లీ సమావేశం ఏర్పాటు చేయించామని గుర్తు చేశారు.కాంగ్రెస్ పార్టీ మద్దతు తీసుకుంటునే అదే పార్టీని విమర్శించడం సరికాదని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు,పొంగులేటి శ్రీనివాస రె డ్డి,ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యలతో చర్చించి సింగరేణి కార్మికుల సంక్షేమానికి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఐఎన్టియుసి జనరల్ సెక్రటరీ గోచికొండ సత్యనారాయణ, ఐఎన్టియుసి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వార్డు కౌన్సిలర్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం



**ఇల్లందు, ఏప్రిల్ 4, ప్రజాజ్యోతి:** మున్సిపల్ పరిధిలోని ఆర్ అండ్ ఆర్ కాలనీలో 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య ఆధ్వర్యంలో శరత్ మాక్స్ విజన్ కంటి హాస్పిటల్ సహకారంతో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ దండు సారయ్య మాట్లాడుతూ 13వ వార్డు ప్రజలకు శరత్ మాక్స్ విజన్ కంటి హాస్పిటల్ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. వివిధ రకాల కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అదేవిదంగా అవసరమైన వారికి కళ్లద్దాలతో పాటు ఆపరేషన్లు చేయించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఉచిత కంటి వైద్య శిబిరానికి 13వ వార్డు ప్రజల నుండి అనూహ్య స్పందన వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శరత్ మాక్స్ విజన్ కంటి హాస్పిటల్ సిబ్బంది, 13వ వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా రన్ ఫర్ జీసస్



**ఇల్లందు రూరల్, ఏప్రిల్ 4, ప్రజాజ్యోతి:**
గుడ్ ఫ్రై డే ను పురస్కరించుకొని శనివారం అన్ని చర్చిల సంఘాల ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ ను ఘనంగా నిర్వహించారు. ఈ ర్యాలీలో ఏసు క్రీస్తు శాంతి సందేహాలు, ఆయన గొప్పతనాన్ని వివరించారు. ప్రతి ఒక్కరూ శాంతి మార్గంలో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్ సాధనపల్లి క్రాంతి, ఫాస్టర్లు పాల్ దినకర్, జూన్సన్, సెల్వరాజు, చార్లెస్, పాశం రాకేష్ కిరణ్, పాశం రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

## గాయం నుంచి కోలుకుని మళ్లీ రింగ్‌లో మెరవాలి



**చుంచుపల్లి , ఏప్రిల్ 4 ( ప్రజాజ్యోతి ) :** జిల్లాకు పేరు తెచ్చిన రెజ్లర్ ఏ. వెంకట ప్రసాద్ త్వరగా కోలుకుని మళ్లీ పోటీల్లో సత్తా చాటాలని టీపీసీసీ కార్యదర్శి, జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు నాగ సీతారాములు ఆకాంక్షించారు. చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాయపూర్‌లో మార్చి 28న ప్రారంభమైన కేలో ఇండియా ట్రైబల్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించిన వెంకట ప్రసాద్ తొలి రెండు రౌండ్లలో ప్రత్యర్థులపై ఆధిపత్యం చాటుతూ విజయం సాధించారు. అయితే క్వార్టర్ ఫైనల్ పోరులో పాల్గొంటున్న సమయంలో కాలి మణికట్టు వద్ద గాయపడి శస్త్రచికిత్స చేయించుకోవాల్సి వచ్చింది. చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వెంకట ప్రసాద్‌ను నాగ సీతారాములు స్వయంగా ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకట ప్రసాద్ ఇప్పటికే యూనివర్సిటీస్ రెజ్లింగ్, ఫెడరేషన్ కప్, జాతీయ సాయి సీనియర్స్ వంటి పలు జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించి జిల్లా కీర్తిని దేశవ్యాప్తంగా చాటారని కొనియాడారు. త్వరగా కోలుకుని మళ్లీ మైదానంలోకి దిగి మరిన్ని విజయాలు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి. కాశీ హుస్సేన్, ఉపాధ్యక్షుడు ఆదినారాయణ, కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యకు స్వర్ణ తులసార్చన

**- అధిక సంఖ్యలో రామయ్యను దర్శించుకున్న భక్తులు**


**- నిత్యకల్యాణంలో పాల్గొన్న 88 జంటలు**



**భద్రాచలం టౌన్ , ఏప్రిల్ 4 , ప్రజాజ్యోతి,** భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో శనివారం స్వామి వారికి ఆర్జిత సేవలో భాగంగా స్వర్ణ తులసార్చన నిర్వహించారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేనార్చన, పుణ్యాహావచనం, కంకణదారణ, యజ్ఞోపవీతదారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, వేద ఆశీర్వచనంను వైదిక బృందం నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు స్వామి వారి మూలవరుల దర్శన భాగ్యం కల్పించారు. కల్యాణంలో 88 జంటలు పాల్గొన్నాయి. అదేవిధంగా స్వామివారిని వరుస సెలవుదినాలు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. గత రెండు రోజులుగా రామాలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది.

## జనగణణ లో ప్రత్యేక రీజియన్ కాలం ఏర్పాటు చేయాలి

**- జిఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ**



**చర్ల, ఏప్రిల్ 04: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో శనివారం తుడుం దెబ్బ ఆఫీసు ఆవరణలో సీనియర్ నాయకులు వాసం ముసలయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో గోండ్వానా సంక్షేమ పరిషత్. రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ మాట్లాడుతూ ఈ భారత దేశంలో స్వతంత్రం సిద్ధించి 78 సంవత్సరాలు గడుస్తున్న షెడ్యూల్ ఏరియా దేశ్యప్తంగా ఆదివాసీల సమస్యలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఏమాత్రం కనబడటం లేదని ఎక్కడ చూసినా ఏదో ఒక ప్రాంతంలో ఆదివాసుల మీదనే దాడులు హత్యలు మానభంగాలు జరుగుతున్నాయని ఆదివాసుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వాలు ప్రతీష్ట అమలకు చొరవ చూపడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా 2027న జరిగే జనగణన సర్వే లో దేశవ్యాప్తంగా ఉన్న ఆదివాసులు 10 కోట్ల మంది ఆదివాసుల ఆయా రాష్ట్రాలలో ఉన్న గిరిజనుల సంప్రదాయాల ప్రకారంగా వారి ఆచారాలను పరిగణలోకి తీసుకొని ప్రత్యేక రిలీజియన్ కాలమును ఏర్పాటు చేయాలని ఆ కాలంలో ఆదివాసీలను నమోదు చేయాలని మేము డిమాండ్ చేస్తున్నాం అని అన్నారు. ఆదివాసులకు ప్రపంచంలో ప్రత్యేక సాంస్కృతి సాంప్రదాయాల గుర్తింపు ఉన్నదని అలాంటి ఆదివాసీలను హిందువులలో నమోదు చేసి హిందువులుగా ఉన్నారని ప్రచారం చేయడంలో నిజం లేదని కుండబద్దలు కొట్టినట్లుగా చెప్పారు. 2027లో జరిగే జన గణన సర్వే కేంద్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసి దేశవ్యాప్తంగా ఉన్న ఆదివాసీల జీవన విధానమును వారి ఆచార సంస్కృతిని సాంప్రదాయాలను పరిగణనలోకి తీసుకొని పరిశీలించి జనగణణ లో ప్రత్యేక రీజయన్ కాలంలో నమోదు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం అని అన్నారు .ఈ సమావేశంలో తాటి రామకృష్ణ. పూనెంవరప్రసాద్. కలాం శ్రీను పాల్గొన్నారు.

## ఘనంగా అద్దంకి దయాకర్ జన్మదిన వేడుకలు



**చర్ల, ఏప్రిల్ 04: ( ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో శనివారం ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ జన్మదినాన్ని పురస్కరించుకొని మాల మహానాడు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాల మహానాడు మండల గౌరవాధ్యక్షులు మోతుకూరి ప్రభాకర్ రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు ముందుగా కేక్ కట్ చేసుకుని ఒకరినొకరు తినిపించుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం మాల మహానాడు నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన అనేక సామాజిక ఉద్యమాలలో ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ క్రియాశీలకంగా పనిచేశారని,ముఖ్యంగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కోసం జరిగిన మలిదశ ఉద్యమంలో అనేకమంది మేధావులతో కలిసి ఉద్యమాలు చేసిన చరిత్ర అని ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం చేసిన ఉద్యమంలో అద్దంకి దయాకర్ పాత్ర మరువలేనిదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు భద్రాచలం నియోజకవర్గ అధ్యక్షులు కారంపూడి సాల్మన్ రాజ్, మండల ప్రచార కార్యదర్శి కొంగూరు సత్యనారాయణ, మండల ఉపాధ్యక్షులు తోటమల్ల కృష్ణారావు, మండల కమిటీ సభ్యులు ఇప్పా ప్రభుదాస్, మేడబత్తిని గోవర్ధన్, పరవా బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# కేటీపీఎస్ గేటు ఎదుట ఆర్టిసన్ల ధర్నా

**దద్దరిలోన కేటీపీఎస్ ప్రాంగణం**

**సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు సిద్ధం**



**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 4,ప్రజా జ్యోతి:** టీవీ ఏ ఈ జాక్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక కే టి పి ఎస్ అంబేద్కర్ సెంటర్ నందు నిర్వహించిన ఆర్టిజన్ల మహా ధర్నా కార్యక్రమం విజయవంతమైంది , ఈ ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ , సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వరరావు , బిజెపి జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి , వివిధ పార్టీల ముఖ్య నాయకులు, పలువురు జేఏసీ నాయకులు మాట్లాడుతూ గత అనేక సంవత్సరాలుగా కాంట్రాక్టు లేబర్గా విధులు నిర్వహిస్తున్న ఆర్టిజన్లను బిఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టిజనులుగా గుర్తించినప్పటికి బ్రిటిష్ కాలం నాటి స్టాండింగ్ ఆర్డర్ ను తమకు అంటగట్టి తీవ్ర అన్యాయం చేసిందని జేఏసీ నాయకులు అన్నారు. ఒకే సంస్థలో ఒకే రూల్ ఉండాలి వేరువేరు రూల్స్ ఎలా వర్తింపజేస్తారు అని ప్రశ్నించారు. తక్షణమే రాష్ట్రంలోని విద్యుత్ సంస్థల్లో విధులు నిర్వహిస్తున్నటువంటి దాదాపు 23600 మంది ఆర్టిజన్లలో దాదాపు 5000 మంది ఎటువంటి ఎంప్లాయ్ బెనిఫిట్స్ లేకుండా మరణించడం,పదవీ విరమణ పొందడం జరిగిందన్నారు ,ప్రభుత్వం ఏపీఎస్సీబీ రూల్స్ ను వర్తింపజేసి కన్వర్షన్ చేయడం వల్ల ప్రభుత్వంపై ఎటువంటి ఆర్థిక భారం పడదని తద్వారా 19000 ఆర్టిజన్ కుటుంబాల జీవితాలకు భరోసాను కల్పించినట్లే అవుతుంది అని అన్నారు, యాజమాన్యాన్ని ఎన్నిసార్లు అభ్యర్థించినా తమను పట్టించుకోవట్లేదు అని ఇక సహించేది లేదని సమ్మెకు సన్నద్ధమైనట్టు తెలిపారు. ఏప్రిల్ 7వ తేదీ లోపు జేఏసీని చర్చలకు పిలిచి ఆర్టిజన్ల సమస్యలు ,అన్మాండ్ కార్మికుల, తదితర అంశాలను పరిష్కరించని ఎడల ఏప్రిల్ 8వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి అన్ని విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న ఆర్టిజన్లు నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమానికి మద్దతు పలుకుతూ కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్. గణేష్, సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వరరావు, బిజెపి జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, 4వ డివిజన్ కార్పొరేటర్ చెరుకు భాగ్యలక్ష్మి, 34వ డివిజన్ కార్పొరేటర్ భట్టు లలిత, ఐ ఎన్ టి యు సి జిల్లా కార్యదర్శి జలీల్, సిపిఐ నాయకులు పూర్ణచందర్రావు, నిమ్మల రాంబాబు, ఉప్పు శెట్టి రాహుల్, న్యూ డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు, విద్యుత్ సంస్థల్లోని ట్రేడ్ యూనియన్ నాయకులు టిఆర్వికెఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చారు గుండ్ల రమేష్, 1104 కంటే రాజేందర్, 327 సాధన రామకృష్ణ, 1535 రాధాకృష్ణ, సిఐటియు అంకిరెడ్డి నరసింహారావు, ఏఐటియుసి రావుల మురళి, బి ఎం ఎస్ గొర్రె వేణుగోపాల్, ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ పూరపాటి రమేష్ ,రాష్ట్ర టీవీఏఈ జేఏసీ చైర్మన్ సతీష్ రెడ్డి, కన్వీనర్ సాయిలు, వైస్ చైర్మన్ శ్రీధర్ గౌడ్, కో కన్వీనర్ చందర్ సింగ్ ఠాగూర్, జెన్ కో చైర్మన్ జక్కుల రమేష్, కన్వీనర్ ఆవుల కృష్ణారెడ్డి, ఒకన్వీనర్ చిలివేరు మల్లయ్య, కేటీపీఎస్ టీవీ ఏఈ జెఏసి చైర్మన్ వెంపటి అనిల్ కుమార్, కన్వీనర్ మంకెన వెంకటేశ్వర్లు, కో చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, కో కన్వీనర్ సాయిబాబు, వైస్ చైర్మన్ వెంకట్రావు, ట్రెజరర్ రమేష్, జేఏసీ నాయకులు సాంబ, రవీందర్, శ్రీనివాసరావు, మహిళా నాయకురాలు శారద, దేవి, మంగమ్మ, సతీష్, పల్లం రాజు తదితరులు పాల్గొన్నారు.

# స్మశాన వాటికకు స్థలం కేటాయించండి



**ఇల్లందు, ఏప్రిల్ 4, ప్రజాజ్యోతి:** మండలంలోని ఇందిరానగర్ గ్రామపంచాయతీకి స్మశాన వాటిక స్థలాన్ని కేటాయించాలని కోరుతూ శనివారం ఇల్లందు ఎఫ్డిఓ కరుణాకర చారి, రేంజర్ చలపతి రావు లను ఎమ్మెల్యే పిఏ రాజేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, మాజీ వైస్ ఎంపీపీ మండల రాము, ఇందిరానగర్ పంచాయతీ సర్పంచ్ పాలెం లలిత లు కోరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య కు స్మశాన వాటిక స్థల సమస్య దృష్టికి తీసుకువెళ్లగా ఎమ్మెల్యే ఇల్లందు ఎఫ్డిఓ తో మాట్లాడడం జరిగింది. దింతో ఎమ్మెల్యే పిఏ, మార్కెట్ కమిటీ చైర్మన్, ప్రజా ప్రతినిధులు, మాజీ వైస్ ఎంపీపీ, సర్పంచ్ లు ఎఫ్డిఓ, డేంజర్ లతో మాట్లాడి ఇందిరానగర్ పంచాయతీ స్మశాన వాటిక సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. సుమారుగా 50 ఏళ్లకు పైగా వడ్డెర కులానికి చెందిన వారిని అప్పటి స్మశాన వాటిక స్థలంలోనే దహన సంస్కారాలు నిర్వహించేవారని తెలిపారు. ఇందిరానగర్ గ్రామపంచాయతీకి స్మశానవాటిక లేదని గుర్తు చేశారు. సానుకూలంగా స్పందించిన ఎఫ్డిఓ సమస్యను కాలయాపన కాకుండా త్వరితగతిన పరిష్కరించడం జరుగుతుందని తెలిపినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పులి సైదులు, కాంగ్రెస్ నాయకుడు కాకటి భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రాన్ని సక్రమంగా చూసుకోలేని రేవంత్‌రెడ్డి కేరళం ఎన్నికల్లో అసత్యాలు ప్రచారం చేస్తున్నారు

**కేరళంలో ఎన్నికల ప్రచారంకు వందల కోట్ల ప్రకటనలు ఇస్తున్న సీఎం రేవంత్**

**రాల్‌కు రూ.1000 కోట్ల మూటలు పంపి**

**కేరళ సీఎంను విమర్శిస్తున్నారు**

**సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి**



**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 4 ,ప్రజాజ్యోతి,** రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి తన తెలంగాణని సక్రమంగా చూసుకోలేరు కానీ కేరళం రాష్ట్రంకు వెళ్లి అక్కడ తెలంగాణలో ఆరు గ్యారెంటీలు అమలు చేసామని అసత్యాలు ప్రచారం చేస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి అన్నారు. భద్రాచలంలో శనివారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలను అదుపు చేయడంలో విఫలమైందని పేర్కొంటూ గ్యాస్ బండలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ,ఎన్డీఏ, ప్రభుత్వం ఇటీవల కాలంలో కమర్షియల్ సిలిండర్‌ల మీద వరుసగా రేట్లు పెంచుతూ 1600 ఉన్న సిలిండర్‌ని 2,300 పెంచడం జరిగినది అన్నారు. గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్ లను రూ. 1000 రూపాయలకు పెంచడానికి కారణం ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధం కారణంగా ఈ పరిస్థితి వచ్చినదని మోడీ గారు చెప్పటం చాలా సిగ్గుచేటని విమర్శించారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి మన రాష్ట్రంను బాగు చేయకుండా కేరళం రాష్ట్రంలో తెలంగాణ మోడల్ అభివృద్ధి చేస్తామంటూ వందల కోట్ల రూపాయలు అక్కడి పత్రికలకు ప్రకటనల రూపంలో ప్రజల సొమ్మును తగలబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో ఇప్పటికే మూడున్నర లక్షల కోట్ల అప్పు చేసి ఆ సంపద మొత్తాన్ని రాహుల్ గాంధీ కి మూటల రూపంలో మోయటం సరి సరికాదని ఇప్పటికైనా తెలంగాణలో ఇచ్చిన ఆరూగ్యారెంటీలను అమలు చేసే కృషి చేయాలని డిమాండ్ చేసినారు. ఒకవైపు సామాన్యులు రోడ్డు పక్కన చిన్న చిన్న హోటల్స్?? పెట్టుకొని పానీ పూరి బండి అమ్ముకుంటూ జీవిస్తున్న అనేక మందిపై ఈ కమర్షియల్ గ్యాస్ రేట్లు పెరగడం వల్ల నిరుద్యోగులుగా మారుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అంత రేటు పెట్టిన ఆ గ్యాస్ కూడా సక్రమంగా అందకపోవటం వలన బ్లాక్లో కొనుక్కోవాల్సిన దుస్థితి ఏర్పడిందని దీనికి కారణం మోదీ ప్రభుత్వ విధానాలు కాదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ పట్టణ నాయకులు, నాగరాజు ,కుంజ శ్రీను అజయ్ కుమార్, సీనియర్ నాయకులు బీబీజీ తిలక్ ,ఎంవీఎస్ నారాయణ, మరియు డేగల మాధవరావు, మురళీకృష్ణ ,భీమేశ్వరరావు ,ముత్తయ్య, రవీందర్, అబ్దుల్ సత్తార్ ,కో ర్సా రవి సుధాకర్ రెడ్డి ,తదితరులు పాల్గొన్నారు

# జిల్లాకు మినీ కలెక్టరేట్ భద్రాచలం ఐటీడీఏ

**సంక్షేమ పథకాలతో గిరిజనాభివృద్ధికి బాటలు వేస్తున్నాం**

**గ్రూప్-1 శిక్షణ డిప్యుటీ కలెక్టర్‌లతో భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాల్**

**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 4 , ప్రజాజ్యోతి,** జిల్లాకు పరిపాలన కేంద్రమైన కలెక్టరేట్‌తో పాటు గిరిజనుల సంక్షేమానికి సంబంధించి స్వయంప్రతిపత్తితో నిర్ణయాలు తీసుకొని వారి జీవనాభివృద్ధికి భద్రాచలం ఐటీడీఏ కృషి చేస్తుందని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాల్ అన్నారు. శనివారం జిల్లాలో శిక్షణకు వచ్చిన గ్రూప్-1 శిక్షణ డిప్యుటీ కలెక్టర్లతో కలిసి వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీవో రాల్ మాట్లాడుతూ గ్రూప్-1 హోదాలో ఉద్యోగం చేసే మీరు నిరుపేదలు, గిరిజనులకు సంబంధించి అనేక నిర్ణయాలు తీసుకొని అమలు చేసే అవకాశం మీ చేతుల్లోనే ఉంటుందని, ప్రభుత్వం తీసుకునే అనేక నిర్ణయాలను క్షేత్రస్థాయిలో అమలు చేసి ప్రభుత్వంకు పేరు తెచ్చే గురుతర బాధ్యత మీపై ఉందన్నారు. భద్రాచలం ఐటీడీఏ ద్వారా గిరిజన సంక్షేమానికి చేస్తున్న కృషిని, తాను పీవోగా చేరినప్పటి నుంచి తీసుకున్న నిర్ణయాలు, విద్య, వైద్య రంగాల్లో సాధించిన అభివృద్ధిని వారికి వివరించారు. అనంతరం గిరిజన మ్యూజియంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ఐటీడీఏ పీవో, భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయాధికారి శివ నాయక్ తో కలిసి డిప్యూటీ కలెక్టర్ల బృందం మరియు ఐటీడీఏ అధికారులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని వారికి నచ్చిన వివిధ రకాల కళా ప్రదర్శనలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా శిక్షణ బృందానికి నాయకత్వం వహిస్తున్న గ్రూప్-1 అధికారులు రాజ్నాథ్, లక్ష్మీ దీపికలు మాట్లాడుతూ డిప్యూటీ కలెక్టర్‌లుగా ఎంపికైన మేము శిక్షణ నిమిత్తం భద్రాచలం వచ్చి ఐటీడీఏ ద్వారా ప్రవేశపెడుతున్న వివిధ రకాల సంక్షేమ పథకాలు, గిరిజన మహిళలకు, ఎస్ హెచ్ జి



గ్రూప్ మహిళలకు, ఆర్గానిక్ పంటలు పండించే గిరిజన రైతులకు ఆర్థికంగా తోడ్పాటు అందిస్తున్న ఐటీడీఏ పీవో, యూనిటీ అధికారులను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారి అశోక్, ఆర్ సి ఓ గురుకులం అరుణకుమారి, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, ఏవో సున్నం రాంబాబు, వీడియో హరికృష్ణ, డీఎస్ఓ ప్రభాకర్ రావు, మ్యూజియం ఇంచార్జ్? వీరాస్వామి పాల్గొన్నారు.

# టి 10 క్రికెట్ పోటీలు ప్రారంభం

**ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు**

**క్రీడలలో యువత జాతీయ స్థాయి పోటీలలో రాణించాలి-ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు**

**చర్ల, ఏప్రిల్ 04: (ప్రజా జ్యోతి ) :** చర్ల మండలంలో శనివారం చర్ల యువత ఆధ్వర్యంలో స్థానిక గడింకోట, పోలీస్ క్రీడమైదానాలలో నిర్వహిస్తున్న టి 10 అంతరాష్ట్ర క్రికెట్ పోటీలకు ముఖ్యఅతిథిగా భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు పాల్గొన్నారు. ముందుగా సిఐ రాజు వర్మ బౌలింగ్ చేయగా ఎమ్మెల్యే వెంకట్రావు బ్యాటింగ్ చేసి పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలవైపు మరలకుండా క్రీడలపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. సన్మార్గంలో నడవడానికి క్రీడలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. క్రీడలు మానసికోల్లాసంతో పాటు దేహదారుడ్యాన్ని పెంపొందిస్తాయని వెల్లడించారు. క్రీడాకారులు తమలో ఉన్న నైపుణ్యాన్ని పెంపొందించుకొని రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదగాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చదువులతో పాటు క్రీడలకు పెద్దపీట వేస్తోందని గుర్తు చేశారు. రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకాటి శ్రీహరి మన జిల్లాకు ఇన్చార్జి మంత్రి కావడం మన అదృష్టమని అన్నారు. ప్రతి మండలంలో క్రీడా మైదానాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. క్రీడా ప్రాంగనాల నిర్మాణం, అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపితే తాను నిధులు తెప్పించే బాధ్యత తీసుకుంటానని పేర్కొన్నారు. యువత క్రీడలతో పాటు చదువులలోనూ రాణించాలన్నారు. నాణ్యమైన చదువులు చదివినప్పుడే జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఉద్యోగం కావాలని కోరుకోవద్దని తమకు ఇష్టమైన రంగాన్ని ఎంచుకొని అందులో రాణించాలని కోరారు. ప్రభుత్వం నిరుద్యోగ యువతను ప్రోత్సహించేందుకు అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే ఇటీవల వాజేడు మండలంలో ఏటీసీ సెంటర్ ను ప్రారంభించినట్లు వెల్లడించారు. అక్కడ నిరుద్యోగ యువతీ, యువకులకు ఆధునిక సాంకేతిక తో కూడిన శిక్షణను ఇస్తున్నట్లు వెల్లడించారు. ఇటువంటి అవకాశాలను సద్వినియోగపరచుకొని జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలని అన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా క్రీడాకారులకు నిర్వాహకులు మెరుగైన సౌకర్యాలను



కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మంచినీటిని అందుబాటులో ఉంచాలని వి వేసవి తీవ్రత దృష్ట్యా ఉదయం, సాయంత్రం వేళలలో పోటీలను నిర్వహించాలని సూచించారు. యువతను సన్మార్గం వైపు మరల్చేందుకు క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. ఇటువంటి మరిన్ని క్రీడా పోటీలను నిర్వహించాలని కోరారు. క్రీడలను ప్రోత్సహించేందుకు తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ రాజు వర్మ, ఎస్సై కేశవ్, విద్యుత్ శాఖ ఏఈ వెంకటేశ్వరరావు, ఆర్ డబ్ల్యూ ఎస్ ఏఈ లు రాము, అరుణ్, కాంగ్రెస్ నాయకులు చీమలమర్రి మురళికృష్ణ, పోలిన లంకరాజు, స్థానికులు కొత్తపల్లి రామాంజనేయులు, కొట్టేరు శ్రీనివాస్ రెడ్డి, నిర్వహకులు కాకి అనిల్, బోళ్ల వినోద్, ఆలం ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన పంచాయితీ భవనము ప్రారంభోత్సవం

**ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ .తెల్లం వెంకట్రావు**

**చర్ల, ఏప్రిల్ 04: (ప్రజా జ్యోతి ) :** చర్ల మండలంలో శనివారం మొగళ్లపల్లిలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనము ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పాల్గొన్నారు. రూ. 20 లక్షల ప్రభుత్వ, ఉపాధిహామీ నిధులతో నూతనంగా నిర్మించిన మొగళ్లపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు . ఈ సందర్భంగా ఎమ్యెల్యే వెంకటరావు మాట్లాడుతూ సర్పంచ్ లు, పాలకవర్గ సభ్యులు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసిన నిధులను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు ఉపయోగపడే పనులు ఎక్కడ చేయాలో ముందుగానే గుర్తించి అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదలు, రైతులు, మహిళల కొరకు పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని ఈ నెలలలో పెద్ద ఎత్తున రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ళు మంజూరుకానున్నాయని అర్హులైన ప్రతి పేదకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసే బాధ్యత తీసుకుంటానని వెల్లడించారు. లబ్ధిదారులు ఆందోళన చెందవద్దని విడతల వారీగా అర్హులైన ప్రతి పేదవాడికి ఇల్లు కట్టిస్తామని హామీ ఇచ్చారు. మొదటి విడతలో నియోజకవర్గ వ్యాపితంగా 4 వేల ఇళ్ళు మంజూరయ్యాయని వీటి నిర్మాణాలు కొన్ని పూర్తవ్వగా మిగిలినవి చివరి దశలో ఉన్నాయన్నారు. విడతప వారీగా నగదు విడుదల చేయడం వల్లే లబ్ధిదారులు నిర్మాణాలను పూర్తిచేసుకోగలిగారని పేర్కొన్నారు. అంతకు ముందు సి కత్తిగూడెం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ అభయాంజనేయ స్వామివారి ఆలయ శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్యెల్యే పాల్గొన్నారు . ఈ



కార్యక్రమంలో సర్పంచ్ ఇర్ప ఉమ, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్ప శ్రీనివాసరావు, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపిడివో కనపర్తి ఈదయ్య, ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల బుచ్చిబాబు, కాంగ్రెస్ నాయకులు చీమలమర్రి మురళీకృష్ణ, పోలిన లంకరాజు, ఇర్ప వసంత్, గుండుపూడి బాస్కర్ రావు, బండారు రామకృష్ణ, మడకం పద్మజ, పటేల్ వెంకటేశ్వర్లు, స్దానికులు కొటేరు శ్రీనివాసరెడ్డి, కొత్తపల్లి రామాంజనేయులు, కడెం సత్యనారాయణ, పోలిన రామచంద్రరావు పాల్గొన్నారు.

## అందరి ఆరోగ్యం కోసం ప్రపంచ పర్యావరణ సంస్థ కృషి అభినందనీయం

**-భద్రాచలం మండల విద్యాశాఖ అధికారిణి రమ**




**భద్రాచలం టౌన్ , ఏప్రిల్ 4 , ప్రజాజ్యోతి,** అందరి ఆరోగ్యం కోసం ప్రపంచ పర్యావరణ సంస్థ కృషి అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భద్రాచలం ఎంఈఓ టి.రమ అన్నారు. ప్రపంచ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో సార్వి సంస్థ నిర్వాహకురాలు స్రవంతి సహకారంతో శనివారం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బాలికల ఆరోగ్యం, సామాజిక బాధ్యత అన్న అంశం అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో ఎంఈవో రమ మాట్లాడుతూ భారతదేశంలో ఆడబిడ్డల నెలసరి కార్యక్రమం గురించి సరైన అవగాహన లేకపోవడం మూలంగా భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సైతం ప్రతి పాఠశాలలో, ప్రతి కళాశాలలో యుక్త వయస్సులో అడుగుపెట్టిన ప్రతి ఆడబిడ్డకు ప్రతి నెలసరికి అవసరమైన శానిటేషన్ ప్యాడ్స్?? ను ఉచితంగా ఇవ్వాలని సుప్రీంకోర్టు చెప్పిన కూడా ఈరోజు వరకు అమలుకు నోచుకోకపోవడం విచారకరమన్నారు. ఆడబిడ్డలకు అనేక రకాల అపోహలు మూలంగా అనేక రకాల మానసిక శారీరక సమస్యలు కొని తెచ్చుకుంటున్నారని ఈ కీలక సమయంలో ప్రపంచ పర్యావరణ సంస్థ జాతీయ కార్యవర్గం ఆధ్వర్యంలో తమ పాఠశాలలో సార్వి సంస్థ నిర్వాహకురాలు స్రవంతి సహకారంతో జిల్లాలోని పలు పాఠశాల్లో వేల మంది ఆడబిడ్డలకు ఉచితంగా సానిటేషన్ ప్యాడ్స్?? పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ పర్యావరణ సంస్థ ప్రధాన కార్యదర్శి నిఖిల్ సాయి కోనేటి, జాతీయ కార్యదర్శి సాగర్, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి క్రాంతి నాయుడు, సహాయ కార్యదర్శి ఉపేందర్ యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బరిగల భూపేష్ , భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు శ్యామ్ నాయుడు, తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ శివ యాదవ్, సోషల్ మీడియా కోఆర్డినేటర్స్?? భరత్, వంశీ పాల్గొన్నారు.

## బొజ్జా హేమంత్ భౌతికకాయానికి మాజీ జడ్పీటీసీ నివాళులు



**బూర్గంపహాడ్, ఏప్రిల్ 4 (ప్రజా జ్యోతి):** మండల పరిధిలోని మోరంపల్లి బంజర్ గ్రామానికి చెందిన బొజ్జా హేమంత్ శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత, రామకొండారెడ్డి దంపతులు స్థానిక నాయకులతో కలిసి ఆయన నివాసానికి వెళ్లి హేమంత్ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపారు. దహన సంస్కారం నిమిత్తం తమవంతుగా రూ. 10వేలు కుటుంబసభ్యులకు అందించి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. నివాళులర్పించిన వారిలో బీఆర్ఎస్ గ్రామకమిటీ అధ్యక్షులు కైపు ఖగేందర్రెడ్డి, ఉపసర్పంచ్ పొక్కుల రవి, మేడం లక్ష్మీనారాయణరెడ్డి, మూల బాలిరెడ్డి, కురుకుంట్ల చిన్నప్పరెడ్డి, చేతుల పెద్దవీర్రాజు, గంగుల చంద్రశేఖర్రెడ్డి, శెనగ అప్పారావు, గ్రామస్థులు ఉన్నారు.

## బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగులను మర్యాదపూర్వకంగా కలిసిన మండల నాయకులు

**బూర్గంపహాడ్, ఏప్రిల్ 4 (ప్రజా జ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డిని బీఆర్ఎస్ మండల నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. 2026 డిసెంబర్ లో జరగే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు కేవీ రమణ ముచ్చటించారు. ఆ ఎన్నికలకు సంబంధించి మండలంలో విస్తృతంగా పనిచేస్తామని, యువ గ్రాడ్యుయేట్లను ఓటరుగా నమోదు చేయించడంతో బీఆర్ఎస్ తరపున రాకేష్రెడ్డి గెలుపుకై పనిచేస్తామని తెలిపారు. రాకేష్ రెడ్డిని కలిసిన వారిలో నాయకులు గాడిద దామోదర్, చీకటి ప్రసాద్, సిద్ధిల రవికుమార్, కాకి ప్రసాద్ ఉన్నారు.



## పౌష్టికాహార పంపిణీపై కార్పొరేటర్ విమలాదేవి పరిశీలన



**పాల్వంచ, ఏప్రిల్ 4, ప్రజాజ్యోతి:** పాత పాల్వంచలోని చాకలి బజార్ అంగన్వాడీ సెంటర్ మరియు ప్రైమరీ స్కూల్‌లో విద్యార్థులకు అందిస్తున్న పౌష్టికాహారం (రాగి జావా) పంపిణీ కార్యక్రమాన్ని 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులతో కార్పొరేటర్ ముఖాముఖీగా మాట్లాడి, వారి ఆరోగ్యం, చదువులపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి నిర్వహణను సమీక్షించారు. చిన్నారులకు చిక్కీస్, బాలామృతం, కోడి గుడ్లు పంపిణీ చేసి, పౌష్టికాహారం ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ సిబ్బంది మరియు ఉపాధ్యాయులు కార్పొరేటర్ విమలాదేవిని శాలువాతో సన్మానించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ప్రైమరీ స్కూల్ హెడ్‌మాస్టర్ నాగేశ్వరరావు, అంగన్వాడీ నిర్వాహకులు రాజ్యలక్ష్మి, పద్మ, నాగమణి, మంజుల, వార్డు ఆఫీసర్ నరేష్, ఆర్పీలు యాట అరుణ, నిమ్మల నాగమణి, పుష్ప, నాయకులు బండారు తేజ, బూసి శ్రీను, బొందిలా బాలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యపై సత్వరమే స్పందించండి జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశం

**ఆళ్లపల్లి, మార్చి 4 ప్రజాజ్యోతి :**





అధికారులు కార్యాల యాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. శనివారం ఆయన ఆళ్లపల్లి మండలంలో విస్తృతంగా పర్యటించి ఇందిరమ్మ ఇళ్లు, విద్యాసంస్థలు, ఆరోగ్య కేంద్రం. సాగు క్షేత్రాలను తనిఖీ చేశారు. అనంతోగు గ్రామంలో గలిగ నాగలక్ష్మి ఇంటి నిర్మాణాన్ని పరిశీలించారు. నిర్దేశిత గడువులోగా నాణ్యతతో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆళ్లపల్లి కేజీబీవీలో పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడి, బయాలజీ చిత్రాలను ప్రాక్టీస్ చేయాలని సూచించారు. పాఠశాలలో ఇన్వర్టర్ ఏర్పాటుకు హామీ ఇచ్చారు. మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత లోపాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఎంఈఓ శాంతారావును హెచ్చరించారు. రైతు మద్దెల వెంకటేశ్వర్లు సాగు చేస్తున్న ఆయిల్ పామ్ తోటను సందర్శించారు. మండలంలో 400 ఎకరాల లక్ష్యానికి గాను 290 ఎకరాల్లో సాగు పూర్తయిందని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందుల నిల్వలు, 108 సేవలను పరిశీలించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో భూభారతి పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఎండాకాలం దృష్ట్యా మిషన్ భగీరథ నీటి సరఫరాపై ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పర్యటనలో తహసీల్దార్ జగదీష్వర్ ప్రసాద్, ఎంపీడీఓ శ్రీను, మండల ప్రత్యేక అధికారి లాల్ చంద్, హెచ్.ఎం సరోజినీ, హెల్త్ ఎడ్యుకేటర్ రమాదేవి వివిధ శాఖ అధికారులు రైతులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మైనారిటీ గురుకుల పాఠశాలలో విద్యార్థిపై తోటి విద్యార్థుల దాడి

**- విద్యార్థికి తీవ్ర గాయాలుబి ఆస్పత్రిలో చికిత్స**

**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 4 ,ప్రజా జ్యోతి:** పాల్వంచ పట్టణంలోని స్థానిక నవభారత సమీపంలో గల తెలంగాణ మైనారిటీ బాయ్స్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఒక విద్యార్థిపై తోటి విద్యార్థులు పరస్పరంగా దాడి చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది, ఈ దాడిలో సదరు విద్యార్థికి తీవ్ర గాయాలు కాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం, ఇందుకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి, పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బోట్ల జస్వంత్ పై తోటి విద్యార్థులు దాడి చేయడంతో విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి, విద్యార్థి జస్వంత్ పేరెంట్స్ తెలిపిన వివరాల ప్రకారం, ,,జస్వంత్ చెప్పిన పని చేయని కారణంగానే ఐదుగురు తోటి విద్యార్థులు జస్వంత్ పై మూకుమ్మడిగా దాడి చేసినట్లు తెలిపారు, ఈ ఘటనలో జస్వంత్ కు చేతికి తీవ్ర గాయం కాగా చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు, ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడం విశేషం , ఇది ఇలా ఉండగా గత నాలుగు నెలల క్రితం ఇదే పాఠశాలలో ఇలాంటి సంఘటన చోటు చేసుకుంది, పాఠశాలలో ఈ విధంగా సంఘటనలు చోటుచేసుకుం టున్నప్పటికీ పాఠశాల ప్రిన్సిపాల్ స్పందించకపోవడం విమర్శలకు వెల్లువెత్తుతున్నాయి, జస్వంత్ పై దాడి చేసిన విద్యార్థుల పై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్ స్టేషన్లో జస్వంత్ తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది,

# మహా కుంభాభిషేకానికి కచ్చితమైన ప్రణాళికతో ముందుకెళ్లాలి ఎమ్మెల్యే జారె

**- కోనేరు, గోశాల, యాగశాల నిర్మాణానికి దాతలు ముందుకు రావాలి**



**అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 4, ప్రజా జ్యోతి;** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించనున్న సహస్రకళాభిషేకం, మహా కుంభాభిషేక మహోత్సవాల నేపథ్యంలో ఏర్పాట్లపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. శ్రీ త్రిదండి రామానుజ చిన్నజీయర్ స్వామి ఆధ్వర్యంలో జరగనున్న వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సూచనలు చేశారు. మహా కుంభాభిషేకానికి భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశమున్నందున ప్రతి అంశానికి ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి బాధ్యతలను స్పష్టంగా కేటాయించాలని సూచించారు. కమిటీ సభ్యులకు ముందస్తు సూచనలు ఇచ్చి కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహించాలని తెలిపారు. పక్క ప్రణాళికతో ముందుకెళ్లి వేడుకలను విజయవంతం చేయాలని పేర్కొన్నారు. వేడుకల సందర్భంగా తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రహదారులు, పార్కింగ్ సదుపాయాలు సక్రమంగా ఏర్పాటు చేసి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. అన్నదాన కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఆలయంలో స్వామివారి కోనేరు, యాగశాల, గోశాల నిర్మాణానికి గ్రామ ప్రజలు, పెద్దలు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ నిర్మాణాలకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. ఆలయాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో పాకాల వెంకటరమణ, ఉపసర్పంచ్ మారగాని అశోక్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పర్సా వెంకటేశ్వరావు, వనమా గాంధీ, పానుగంటి రాఘవులు,దోసపాటి రాంబాబు, ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు, భక్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి కమిటీలు సమన్వయంతో పని చేసి ముందుకు సాగాలని ఎమ్మెల్యే సూచించారు.

# భద్రాచలంలో అక్రమ ఇసుక రవాణాపై ఉక్కుపాదం

**- కందకాలు తవ్వించిన తహసీల్దార్ - నిందితులపై పీడీ యాక్ట్ హెచ్చరిక**



**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 4 ప్రజాజ్యోతి** భద్రాచలం గోదావరి నది పరివాహక ప్రాంతంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ముఠాల ఆటకట్టించేందుకు రెవెన్యూ మరియు పోలీస్ యంత్రాంగం రంగంలోకి దిగింది. భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ ఆదేశాల మేరకు శనివారం తహసీల్దార్ దనియాల వెంకటేశ్వర్లు గోదావరి తీరంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు.

**కందకాల తవ్వకం.. రవాణాకు బ్రేక్**

శుక్రవారం నాడు గోదావరి నది ఒడ్డును తవ్వి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు వచ్చిన సమాచారంపై తహసీల్దార్ వెంటనే స్పందించారు. స్థానిక సబ్ ఇన్‌స్పెక్టర్ శ్యామ్ తో కలిసి నదికి వెళ్లే దారులను పరిశీలించి, వాహనాలు వెళ్లకుండా జేసీబీలతో భారీ కందకాలను తవ్వించారు. ప్రకృతి సంపదను కొల్లగొడితే సహించేది లేదని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

**కఠిన చర్యలు తప్పవు: తహసీల్దార్**

ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. "అక్రమ ఇసుక రవాణాకు సహకరించిన భూ యజమానిపై ఇప్పటికే కేసు నమోదు చేస్తున్నాం. ఈ వ్యవహారంలో ఎవరి హస్తం ఉన్నా వదిలిపెట్టే ప్రసక్తి లేదు. సమగ్ర విచారణ జరిపి బాధ్యులందరిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. పునరావృతమైతే అక్రమ రవాణాదారులపై పీడీ యాక్ట్ నమోదు చేయడానికి కూడా వెనుకాడం" అని హెచ్చరించారు.

# డాక్టర్ బాబు జగ్జీవన్ రావ్ 119 వ జయంతిని ఘనంగా నిర్వహించాలి




**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 4 ,ప్రజా జ్యోతి:** డాక్టర్ బాబు జగ్జీవన్ రావు 119 వ జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జగ్జీవన్ రావు ఉత్సవ కమిటీ నిర్వాహకులు పిలుపునిచ్చారు, శనివారం పాల్వంచ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో 43 వ డివిజన్ కార్పొరేటర్ కాల్వ భాస్కరరావు , జగ్జీవన్ రావ్ ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు కాల్వ ప్రకాష్ రావు , కొత్తపల్లి సోమయ్య , జగ్జీవన్ రావు విగ్రహ వ్యవస్థాపక అధ్యక్షులు నేషనల్ అవార్డు గ్రహీత దండోరా శ్రీను లు మాట్లాడుతూ పాల్వంచ పోలీస్ స్టేషన్ ఎదుర గా బాబు జగ్జీవన్ రావ్ 119 వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్ల తెలిపారు, జగ్జీవన్ రావ్ జయంతి కార్యక్రమాన్ని పట్టణంలోని అన్ని వర్గాల ప్రజలు ఘనంగా నిర్వహించుకోవాలన్నారు, అదేవిధంగా బస్టాండ్ సెంటర్లో నిర్మాణం చేసిన జగ్జీవన్ రావు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం వచ్చేనెల మొదటి వారంలో కానీ ,లేక రెండో వారంలో కానీ ఉంటుందన్నారు, విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి రాష్ట్రంలోని పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, హాజరవుతారని తెలిపారు, నేడు ఆదివారం నిర్వహించే బాబు జగ్జీవన్ రావు జయంతి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం నియోజకవర్గ శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె షబీర్ పాషా, కొత్తగూడెం కార్పొరేటర్ మేయర్ మూడు గణేష్, డిప్యూటీ మేయర్ సరిపురపు లలిత కుమారి , జిల్లా నాయకులు కొత్వాల శ్రీనివాసరావు కొత్తగూడెం కార్పొరేట్ కమిషనర్ కోడారు సుజాత, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు తదితరులు పాల్గొంటారని తెలిపారు, ఈ విలేకరుల సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు గొడ్ల మోహన్ రావు, కొమ్మవరపు ఆదాం, కాల్వ రామారావు, గుర్రం వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు

# అక్రమంగా నిల్వ చేసిన 85 క్వింటాల రేషన్ బియ్యం పట్టివేత




**టేకులపల్లి,ఏప్రిల్ 04,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలం బోడు గ్రామంలో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 85 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శనివారం మెరుపు దాడి చేసి పట్టుకున్నట్లు సివిల్ సప్లై అధికారులు తెలిపారు. సివిల్ సప్లై అధికారులు తెలిపిన వివరాల ప్రకారం బోడు గ్రామంలోని సోదాల్లో భాగంగా గ్రామానికి చెందిన ఇరుప సమ్మయ్య నివాసంలో అక్రమంగా నిల్వ ఉంచిన 85 క్వింటాల రేషన్ బియ్యాన్ని అధికారులు గుర్తించి, వెంటనే వాటిని స్వాధీనం చేసుకున్నారు. విచారణలో ఈ బియ్యం నిల్వలు గౌతమ్ అనే వ్యక్తికి చెందినవిగా నిర్ధారణ కావడంతో,అధికారులు ఆయనపై 6ఏ కేసు నమోదు చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పేదల బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచినా, రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా అధికారులు హెచ్చరించారు. పట్టుబడిన బియ్యాన్ని సంబంధిత శాఖకు అప్పగించి,తదుపరి విచారణను వేగవంతం చేశారు. ఈ తనిఖీల్లో ఇల్లందు, కొత్తగూడెం, అశ్వరావుపేట డిప్యూటీ తాసిల్దార్లు శివకుమార్, ప్రభాకర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.